# బూటకపు ఎన్‌కౌంటర్ల ప్రాయోజితమూ, ప్రోత్సాహకమూ - ప్రభుత్వమే

**ఫిలిబిత్** బూటకపు ఎదురుకాల్పులు జరిగి 25 సం॥లు గడిచిపోయిన తర్వాత, 2016 ఏప్రిల్‌లో ఉత్తరప్రదేశ్ రాష్ట్రం - లక్నోలోని సిబిఐ ప్రత్యేక న్యాయస్థానం ఎట్టకేలకు తీర్పు వెలువరించింది. 47 మంది పోలీసు సిబ్బందిని బూటకపు ఎన్‌కౌంటరు కేసులో దోషులుగా పేర్కొంటూ వారికి యావజ్జీవ శిక్ష విధించింది.

ఉత్తరప్రదేశ్‌లోని ఫిలిబిత్ వద్ద 1991 జులై 12న శిక్కు యాత్రికులను తోడ్కొని వెళ్తున్న బస్సును పోలీసులు అడ్డుకున్నారు. పంజాబ్ నుండి శిక్కు మిలిటెంట్ల సమూహం ఉత్తరప్రదేశ్‌లోని ఫిలిబిత్ ప్రాంత లోకి జొరబడుతున్నట్లుగా పోలీసులు ప్రకటించారు. వారందరినీ సమీపంలోని అటవీ ప్రాంతానికి తీసుకెళ్ళి అతి దగ్గర నుండి కాల్చి చంపారు. కాల్చి చంపబడిన వారి నుండి ఆయుధాలు, మందుగుండు సామాగ్రిని స్వాధీనం చేసుకున్నామని కూడా పోలీసులు ప్రకటించారు.

ఈ ఘటనపై కళ్యాణ్‌సింగ్ ప్రభుత్వం నియమించిన కమీషన్, పోలీసులను నిర్దోషులుగా పేర్కొంటూ నివేదికనిచ్చింది. అంతేగాక, ఫిలిబిత్ ఆపరేషన్‌లో పాల్గొన్న పోలీసులు సత్కారానికి అర్హులుగా కూడా పేర్కొంది. ఆనాటి నుండి ఆ ఘటనలో పాల్గొన్న పోలీసులందరూ నిర్దోషులుగా చెలామణీ అవుతున్నారు.

ఏమైనా, సుప్రీంకోర్టు ఆదేశంపై సిబిఐ ఈ ఘటనపై దర్యాప్తు చేసింది. తన పరిశోధనలో ఈ ఘటనను పోలీసులు చేసిన అత్యంత హీనమైన, నీచమైన నేరంగా, హత్యాకాండగా పేర్కొంది. సాయుధ తీవ్రవాదులతో 'ఎన్‌కౌంటర్' పేరుతో పోలీసులు కేవలం తమ ఖ్యాతి కోసం, పారితోషికాలు, పతకాల కోసం ఈ చర్యకు ఒడిగట్టారని పేర్కొంది.

తిరిగి ఇటీవలే జాతీయ మానవహక్కుల నివేదిక (ఎన్‌హెచ్‌ఆర్‌సి) అస్సామ్‌లో జరిగిన నాలుగు ఎదురుకాల్పుల ఘటనలు బూటకమైనవిగా పేర్కొని, అస్సామ్ ప్రభుత్వాన్ని, రక్షణ మంత్రిత్వశాఖను బాధితుల కుటుంబాలకు పరిహారాన్ని, సహాయాన్ని అందించాలని సూచించింది.

2009 జూన్ 22న జియోలిమ్ బాసుమాతరే మరియు ఒఖాఫట్ బాసుమాతరే - అనే ఇరువుర్ని అస్సామ్ రాష్ట్రం - సోనిత్‌పూర్ జిల్లా పరిధిలోని పురోయివాసి వద్ద బూటకపు ఎన్‌కౌంటర్‌లో పోలీసులు కాల్చి చంపారు.

2009 జులై 9న, అస్సాంలోని సోనిత్‌పూర్ జిల్లాలో ఓ బూటకపు ఎన్‌కౌంటర్‌లో అస్సాం పోలీసులు, అస్సాం రైఫిల్స్‌కు చెందిన సైనికులు రజిత్ నర్జరి అలియాస్ అబ్రహాంను బూటకపు ఎదురు కాల్పులలో కాల్చిచంపారు.

2011 ఫిబ్రవరి 23న దిర్పూర్‌లో మిగాక హజారికా మరియు హిమాంశుగోగా అనే ఇరువురిని బూటకపు ఎదురుకాల్పుల్లో పోలీసులు కాల్చి చంపారు.

2008 జులై 23న అస్సామ్ జిల్లా నాగాల్‌లో పోలీసులు జరిపిన కాల్పులలో పికూ ఆలీ మరణించాడు.

ఈ ఎన్‌కౌంటర్లన్నీ బూటకమైనవేనని ఎన్‌హెచ్‌ఆర్‌సి ప్రకటించి, ఆయా రాష్ట్రాల ప్రభుత్వాలను బాధిత కుటుంబాలకు పరిహారం అందజేయాలని చెప్పింది.

తీవ్రవాదులను, ఉగ్రవాదులను నిర్మూలించే పేరుతో మనదేశంలో బూటకపు ఎన్‌కౌంటర్‌లెన్నో ప్రభుత్వాలచే, పోలీసు అధికారులచే, సైనికాధికారులచే సమర్థించుకోబడుతున్నాయి. చనిపోయిన మనిషి తీవ్రవాది కనుక, జరిగింది - బూటకమా, వాస్తవికమా అనేదానితో నిమిత్తంలేదని ప్రకటిస్తున్నారు. చట్టానికి లోబడి శాంతిభద్రతలను కాపాడటానికి ఉద్దేశించినదిగా చెప్పబడే పోలీసు వ్యవస్థ, సైనిక బలగాలు చట్టాతీతంగా హత్యలుగావిస్తూ, చట్టపరమైన ఎలాంటి భయమూ లేకుండా నిర్దోషులుగా వ్యవహరించేందుకు మన పాలకులు, పాలనా వ్యవస్థలు అనుమతిస్తున్నాయి.

పైన పేర్కొన్న ఘటనలలో కొన్నింటిలో దోషులకు శిక్షపడటంకానీ, లేదా బాధిత కుటుంబాలను ఆదుకోవాలనే న్యాయస్థానాల ఆదేశాలుగానీ, 'న్యాయం ఆలస్యమయినప్పటికీ న్యాయం నిరాకరించబడదు' అనే సూక్తిని నిజం చేసినట్లు కనిపించవచ్చుగాక! కానీ, ఈ ఎన్‌కౌంటర్ ఘటనలన్నీ రాజ్యం, దాని యంత్రాంగం యొక్క వర్గస్వభావం గురించి ఎంతో విపులంగా చెపుతున్నాయి.

ఎన్‌కౌంటర్ ఘటనల్లో పాల్గొన్న పోలీసు, సైనిక సిబ్బందికి, అధికార్లకు ప్రోత్సాహకాలు, పదోన్నతులు, పారితోషికాలు కల్పించటమంటేనే రాజ్యం. 'ఎన్‌కౌంటర్ నిపుణుల' సంస్కృతిని సృష్టిస్తోందన్నమాట! ఈ విధంగా రాజ్యమే బూటకపు ఎదురుకాల్పుల సంస్కృతిని ప్రోత్సహిస్తూ, చట్టపరమైన శిక్షల భయమేలేని, చట్టాతీత హత్యలకు ప్రాయోజితురాలిగా వ్యవహరిస్తోంది. మీదు మిక్కిలి ప్రభుత్వాధికారంలోనున్న పాలకులు తీవ్రవాదం, ఉగ్రవాదాలకు వ్యతిరేకంగా పోరాడే పేరిట తమకు మరిన్ని క్రూరమైన చట్టాలు కావాలని డిమాండ్ చేస్తూవస్తున్నారు. ఈ విధంగా ఎన్నో క్రూరమైన చట్టాలు రూపొందించి, అమలుచేయటం ద్వారా మరియు దాని యంత్రాంగం చట్టాలకు, న్యాయానికి బద్ధులై వుండాల్సిన అవసరం లేకుండా ప్రోత్సహిస్తోంది.

ఈ రకమైన పరిస్థితి సహజంగా పోలీసు అధికారులను చిన్నపాటి ప్రోత్సహకాలు, పదోన్నతుల కోసం-మిలిటెంట్లు లేదా తీవ్రవాదుల సహచరులను లక్ష్యంగా చేసుకోవటంద్వారా వారిపై ప్రతీకారం తీర్చుకోవటంతోపాటు - చట్టాతీతమైన హత్యలకు పురిగొల్పుతోంది.

తమ అతి చిన్నపాటి ప్రయోజనాలకోసం పోలీసు అధికారులు అమాయక ప్రజలను కాల్చిచంపిన ఘటనలలో పైన పేర్కొన్న ఘటనలేమీ మొదటిసారిగా జరిగినవి కావు.

కేరళలో 1970ల ప్రారంభంలో వర్గీస్ అనే ఓ కేరళ రాష్ట్రీయుడిని కాల్చి చంపటంతో బూటకపు ఎదురుకాల్పులు ప్రారంభమయ్యాయి. ఆ తర్వాత అనేక రాష్ట్రాలలో, ఇలాంటి ఘటనలు అనేకం జరిగాయి. కానీ, ఈ ఎన్‌కౌంటర్ హత్యలకు పాల్పడిన పోలీసు అధికారులెవ్వరూ దోషులుగా ప్రకటించబడలేదు.

అధికారంలోనున్న పాలకుల అండ, మద్దతుతో మాత్రమే ఈ విధమైన అత్యాచారాలు, హత్యలు జరుగుతాయి.

కనుక నిశ్చయంగా రాజ్యమే ఈ రకమైన హత్యలకు ప్రోత్సాహకంగా, ప్రాయోజితంగా వుందనేది స్పష్టం. ప్రజాస్వామికవాదుల నిలకడైన ఉద్యమాల ద్వారా మాత్రమే ఈ విధమైన చట్టాతీత హత్యలు, బూటకపు ఎదురుకాల్పుల హత్యాకాండ సాగించే సంస్కృతిని దుర్మార్గాన్ని అంతంచేయటం సాధ్యమౌతుంది.